నేడే ఇంటర్ ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్న మంత్రి సబిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షల ఫలితాలను హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డులో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మార్చి 15 నుంచి గతనెల నాలుగో తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,82,677 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 4,65,022 మంది కలిపి మొత్తం 9,47,699 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మార్చి 24వ తేదీ నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమైంది.

పోలవరంపై సంయుక్త సర్వే చేయాలి

- సిడబ్ల్యుసికి ఇఎన్సి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలవరంపై సంయుక్త సర్వే చేయాలని రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్ కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి)కి ప్రత్యేకంగా లేఖ రాశారు. సర్వేచేయడానికి గతంలో ఒప్పుకున్న ఎపి సర్కారు, ఇప్పుడు జాప్యం చేస్తోందని ఫిర్యాదు చేశారు. ఆలస్యం మూలంగా నష్టం జరుగుతోందని గుర్తుచేశారు. సమాచారం అడిగినా ఇవ్వడం లేదని సిడబ్ల్యుసికి రాసిన లేఖలో పేర్కొన్నారు. 25 రోజుల్లో సంయుక్త సర్వే చేయకపోతే వర్షాకాలం ప్రారంభమవుందని, ఆ నేపథ్యంలో సర్వే చేయడానికి అనేక ఆటంకాలు ఎదురవుతాయని గుర్తు చేశారు. గత కృష్ణాబోర్డు భేటీలో ఎపి సర్కారు సర్వే చేయడానికి అంగీకరించి ఇప్పుడు తీవ్ర ఆలస్యం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ మేరకు మూడు పేజీల లేఖను ఇఎన్‌సి సి మురళీధర్ సోమవారం సిడబ్ల్యుసికి రాశారు.

10న కృష్ణాబోర్డు భేటి

కృష్ణా యాజమాన్య బోర్డు సమావేశం ఈ నెల పదిన హైదరాబాద్‌లోని జలసౌధలో జరగనుంది. ఈ మేరకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. ఎపితో ఉన్న వివాదాలు, ఇతర నీటి కేటాయింపులపై ఇందులో చర్చిస్తారు.

వారంలో మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్

- పిఆర్‌టియుటిఎస్ నేతలకు మంత్రి సబిత హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వారం రోజుల్లో మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేస్తామంటూ పిఆర్‌టియుటిఎస్ నేతలకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రిని పిఆర్‌టియుటిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు గత పదేళ్లుగా బదిలీలు, పదోన్నతులు కల్పించకపోవడం వల్ల విద్యార్థులు, టీచర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారికి బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. వారం రోజుల్లో షెడ్యూల్ విడుదలయ్యేలా మార్గదర్శకాలను రూపొందించాలంటూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను ఆదేశించారని తెలిపారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు వీలుగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని, ఇందుకు తగిన సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎంపిఎ రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్, పిఆర్‌టియుటిఎస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మత పిచ్చి దుష్పరిణామాలు తిప్పి కొట్టాలి

- మత మౌఢ్యం పేట్రేగకుండా హరేకృష్ణ సంస్థ పనిచేయాలి : సిఎం కెసిఆర్
- హరేకృష్ణ హెరిటేజ్ టవర్ శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత పిచ్చి దుష్పరిణామాలను తిప్పి కొట్టాలని సిఎం కెసిఆర్ పిలుపునిచ్చారు. మతం అనేది సార్వజనీనమని, ఏ మతంలో తప్పులేదని, మత ప్రవక్తలెవరూ హింసను బోధించలేదని చెప్పారు. మత మౌఢ్యం మనుష్యులను పిచ్చివాళ్లను చేస్తుందనీ, అలాంటివారే ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. రంగారెడ్డి జిల్లా నార్సింగిలో శ్రీకృష్ణ గో సేవా మండలి నిర్మిస్తున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ఆలయ నిర్మాణానికి సోమవారం సిఎం కెసిఆర్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఎత్తయిన 400 అడుగుల ఎత్తు రాధాకృష్ణ మందిరం నిర్మించడం అభినందనీయ మన్నారు. మత విద్వేషాల జోలికి వెళ్లొద్దని, కొన్ని శక్తులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని సూచించారు. వేదాలు, ఉపనిషత్తుల్లోని పరామార్థాన్ని అర్థం చేసుకుని ఆ సందేశాన్ని విశ్వానికి పంచితే అంతకుమించి పరమార్థంలే దన్న రాహుల్ సాంకృత్యాయన్ రచనలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కొంతమంది వేదాల సారాన్ని వక్రమార్గం పట్టిస్తున్నారని చెప్పారు. మత మౌఢ్యం పేట్రేగకుండా హరేకృష్ణ సంస్థ పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరంలో హెరిటేజ్ టవర్ ప్రాజెక్టు చేపట్టడంలో సంతోషంగా ఉందని, చిత్తశుద్ధి, అంకితభావంతో ముందుకెళ్లాలని తెలిపారు. ఇది నగరానికి సాంస్కృతిక మైలురాయిగా నిలువడంతో పాటు దేశ ప్రజలకు ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఆలయ నిర్మాణానికి రూ.25కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించారు. శాంతిని, ఆధ్యాత్మికతను పెంపొందించే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని కెసిఆర్ తెలిపారు. హరేకృష్ణ వారు రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప సహకారం అందిస్తున్నారని సిఎం చెప్పారు. అక్షయపాత్ర సేవలను కొనియాడారు. వారు ప్రతిరోజు అందిస్తున్న అన్నపూర్ణ భోజనం విజయవంతంగా జరుగుతోందని, ఎక్కడ నుంచి ఫిర్యాదులు రావడంలేదని తెలిపారు. అంకిత భావంతో పనిచేస్తున్న అక్షయపాత్ర వారికి తెలంగాణ ప్రజల తనుపున సిఎం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, ఎమ్మెల్సీ వాణిదేవి, రంగారెడ్డి జెడ్‌పి చైర్‌పర్సన్ అనితారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, కార్యదర్శి అరవింద్‌కుమార్, సైబరాబాద్ సిపి స్టీఫెన్ రవీంద్ర, ఆర్డీఓ చంద్రకళ, చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మెన్ వెంకటేష్‌యాదవ్, కమిషనర్ సత్యబాబు, హరేకృష్ణ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో భూ బాధితుల హల్‌చల్

- పెట్రోల్ బాటిల్‌తో ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కలెక్టర్ భవన నిర్మాణం కోసం తీసుకున్న భూములకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజావాణిలో బాధితులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి జరుగుతున్న సమయంలో బాధితులు న్యాయం చేయాలని వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను కొందరు ఒంటిమీద పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం బాధితులు కలెక్టరేట్ ఆవరణలో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గతంలో జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వెంకటరామిరెడ్డి కలెక్టర్ కార్యాలయ నిర్మాణం కోసం దుద్దెడ శివారులోని 663 సర్వేనెంబర్, రాంపల్లి గ్రామ శివారులోని 143 సర్వే నెంబర్లలో 165 మంది రైతుల నుంచి 345 ఎకరాల భూమిని సేకరించారని తెలిపారు. భూమి తీసుకునే సమయంలో తమకు ఒక ప్లాట్‌తో పాటుగా రూ.ఎనిమిది లక్షలు నగదు, బోరుబావులు, చెట్లకు రూ.1.25 లక్షలు, ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయకపోవడంతో ఎన్నోసార్లు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నామని, అయినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ. ఎనిమిది లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుండి వెళ్లేది లేదని, ఎంతటి త్యాగానికైనా సిద్ధమేనని భీష్మించుకూర్చున్నారు. విషయం తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ ముసమిల్ ఖాన్ బాధితులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఆత్మహత్యాయత్నం చేస్తున్న బాధితున్ని అడ్డుకుంటున్న సిబ్బంది



మా జీతాలు చెల్లించండి

- టియులో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏప్రిల్ నెల వేతనాలు తమకు రాకపోవడంతో ఇఎంఐలు కట్టలేకపోతున్నామని, ఇంటి అద్దెలు, ఇతరాత్ర ఖర్చులకు డబ్బులు లేవని అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వాపోయారు. రాజకీయాలతో పంతాలకు పోవడంతో తమ వేతనాలు నిలిచిపోయాయని, వెంటనే తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట 276 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం ధర్నా చేపట్టారు. తెలంగాణ యూనివర్సిటీలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు, రిజిస్ట్రార్ మార్పుల వల్ల తమకు జీతాలు చెల్లించే నాథుడు లేడని వాపోయారు. వైస్ ఛాన్సలర్ మొండి వైఖరి వల్ల ఉన్నత విద్యా శాఖ సమన్వయ లోపంతో వ్యవహరించడం వల్లే తాము జీతాలు అందుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్ వైఖరిపై.. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను కలుసుకొని ముఖ్యమంత్రికి తమ సమస్యలను వివరించాలని కోరనున్నట్టు తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీలో రాజకీయ జోక్యంతో రిజిస్ట్రార్‌ల మార్పులు చోటు చేసుకుంటున్నాయని, పంతాలకు పోయి యూనివర్సిటీ అభివృద్ధికి నోచుకోలేకపోతుందని అన్నారు. ఉన్నత విద్యాశాఖ అధికారులు, గవర్నర్ కలగజేసుకుని యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలను చక్కదిద్దాలని, వెంటనే తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు)
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన



ఆందోళన చేస్తున్న తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్షులు జె కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి బి కిరణ్మయి డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన జిఒ 38 ద్వారా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో డిఎస్‌సి ద్వారా నియమితులై అనేక ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులు ఇందులోకి కవర్ కావడం లేదని చెప్పారు. ఈ ప్రక్రియలో నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వైద్య శాఖలోని ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలను ఎరియర్స్ రూపంలో వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎ కవిత, నగర ఉపాధ్యక్షులు పి లక్ష్మి, నగర కోశాధికారి రాజేశ్వరి, హెచ్‌ఆర్‌డి పద్మ, ఇసి ఎఎన్‌ఎం షీలా, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

కేసులకు భయపడ్డ మాయావతి

- కాన్షీరాం సిద్ధాంతాలను తుంగలో తొక్కేశారు
- బిజెపికి తోక పార్టీగా బిఎస్‌పి
- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్

కేసులకు భయపడ్డ బిఎస్‌పి అధినేత్రి మాయావతి ఆ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం సిద్ధాంతాలను తుంగలో తొక్కేశారని రాష్ట్ర ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఎస్‌పి అనేది బిజెపికి తోక పార్టీగా మార్చారపి, అందుకే బిజెపిని పల్లెత్తు మాటనలేదని తెలిపారు. మాయావతి భయపడుతున్న తీరు చూస్తే ఆమె ఆర్థిక నేరాలకు పాల్పడినట్టుగానే భావించాల్సి వస్తుందన్నారు. యుపిలో తన పాలనలో భారీ ఏనుగు విగ్రహాలను ఏర్పాటు చేసిన ఆమె అంబేద్కర్ విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణ అంటేనే దళితుల సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం అనే రీతిలో సిఎం కెసిఆర్ పాలన ఉందంటూ కొనియాడారు. బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్‌కు గతంలో ఆరేళ్లపాటు గురుకులాల సొసైటీ కార్యదర్శిగా కెసిఆర్ అవకాశం కల్పిస్తే దుర్వినియోగం చేసుకుని సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. మాయావతి అధికారంలో ఉండగా దళిత బంధు ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. జాతీయ స్థాయి నేత మాయావతి అయితే... బహిరంగసభలో జాతీయ అంశాలను ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాజకీయాల్లో మాయావతి శకం ముగిసిందని విమర్శించారు. ఇప్పటికైనా బిజెపి ఆగడాలపై నోరు విప్పి మాయావతి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో అధికారమంటూ పగటి కలలు కనడం మానుకోవాలనీ, బిజెపి మతతత్వ రాజకీయాలని ప్రశ్నించకపోతే మనుగడే ఉండబోదని స్పష్టం చేశారు. మునుగోడు ఉప ఎన్నికలతో ప్రవీణ్ కుమార్ సత్తా ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు.

మణిపూర్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న విద్యార్థులు



ప్రత్యేక విమానంలో మణిపూర్ నుంచి శంషాబాద్ వస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు చెందిన 72 మంది విద్యార్థులు మణిపూర్ నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సోమవారం చేరుకున్నారు. వారికి కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్, అడిషనల్ డిజిపిలు మహేష్ భగవత్, అభిలాష బిస్త్, డిఐజి బి.సుమతి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్ సింగ్ తదితర అధికారులు స్వాగతం పలికారు. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ విద్యార్థులను సురక్షితంగా స్వరాష్ట్రానికి తరలించాలని సిఎం కెసిఆర్ అధికారులను ఆదేశించారు. సిఎం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు మణిపూర్ అధికారులతో చీఫ్ సెక్రటరీ శాంత కుమారి, డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ అంజనీకుమార్ సంప్రదింపులు జరిపారు. మణిపూర్ నుంచి తెలంగాణ విద్యార్థులను తరలించేందుకు ప్రత్యేక విమానాలను ఏర్పాటు చేశారు.

తెలంగాణకు చెందిన మొత్తం 130 మంది విద్యార్థుల్లో 72 మంది రాష్ట్రానికి తిరిగి రాగా మిగిలిన విద్యార్థులు మంగళవారం తెల్లవారు జామున హైదరాబాద్‌కు చేరుకుంటారని అధికారులు తెలిపారు. సిఎం సకాలంలో స్పందించి విద్యార్థులను స్వస్థలానికి తీసుకురావడం పట్ల మణిపూర్ నుంచి వచ్చిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టు నుంచి స్వస్థలాలకు చేరుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ శంషాబాద్ మండల అధ్యక్షులు కే.చంద్రారెడ్డి, చిన్న గోల్కొండ పిఎసిఎస్ చైర్మన్ బొమ్మ దవణాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలికపై లైంగికదాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురం భీం-ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడి చేసిన ఘటన సోమవారం మధ్యాహ్నం జరిగింది. లైంగిక దాడికి పాల్పడ్డ వ్యక్తిని కాలనీ వాసులు చితకబాదారు. స్థానిక పెద్దవాగు రోడ్‌లోని సీ బాపు కాలనీలో ఉన్న ఓ చర్చిలో నిందితుడు రమేష్ (54) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆ కాలనీకి చెందిన పిల్లలు నిత్యం చర్చ్ ఫాదర్ ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉంటారు. సోమవారమూ పిల్లలు ఆడుకోవడానికి రాగా అందులో ఓ ఏడేళ్ల బాలికను డ్రైవర్ రమేష్ బాత్‌రూమ్‌కు తీసుకెళ్లి కర్రతో బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో చర్చి ఫాదర్ తిమోతి ఇంట్లో లేరు. అతని భార్య సువర్ణ ఇంటి పనిలో నిమగ్నమై ఉండటంతో గమనించలేదు. బాలిక రక్తస్రావంతో ఏడ్చుకుంటూ తన అమ్మమ్మ ఇంటికెళ్లి జరిగిన విషయం చెప్పింది. దాంతో కాలనీవాసులు చర్చి వద్దకు వచ్చి రమేష్‌ను చితకబాదారు. విషయం తెలుసుకున్న రూరల్ సిఐ నాగరాజు, ఎస్‌ఐ సోనియా, టౌన్ ఎస్‌ఐ చంద్రశేఖర్ చర్చ్ వద్దకు వచ్చి లైంగిక దాడికి పాల్పడ్డ రమేష్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలిక తల్లిదండ్రులు ఇనుప తుక్కు ఏరుకొని అమ్మి జీవనం సాగిస్తుంటారు. ప్రతి రోజూ ఉదయమే తాము పిల్లలను చర్చి ఫాస్టర్‌ను నమ్మి అక్కడ వదిలి వెళ్తుంటామని, అక్కడ నమ్మకంగా పని చేసే వ్యక్తే ఈ దారుణానికి పాల్పడతాడని తాము ఊహించలేదని బాలిక తల్లిదండ్రులు వాపోయారు. బాలికను చికిత్స నిమిత్తం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సిఐ నాగరాజు తెలిపారు.

రేపటినుంచి ఎంసెట్

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్ రాతపరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆన్‌లైన్‌లో పకడ్బందీగా ఈ పరీక్షలను నిర్వహించడం కోసం అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. రోజూ రెండో విడతల్లో పరీక్షలుంటాయి. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటలకు రెండో విడత పరీక్షలు జరుగుతాయి. మొదటి విడతకు ఉదయం 7.30 నుంచి తొమ్మిది గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. రెండో విడతకు మధ్యాహ్నం 1.30 నుంచి మూడు గంటల వరకు అనుమతిస్తారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతిని నిరాకరిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఉన్న నియమ, నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. తెలంగాణలో 104, ఎపిలో 33 కలిపి మొత్తం 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విభాగానికి 2,05,405 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,15,361 మంది కలిపి మొత్తం 3,20,766 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఇంజినీరింగ్‌కు తెలంగాణ నుంచి 1,53,935 మంది, ఎపి నుంచి 51,470 మంది అభ్యర్థులు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి తెలంగాణ నుంచి 94,614 మంది, ఎపి నుంచి 20,747 మంది దరఖాస్తు చేశారు. గతేడాది ఎంసెట్‌కు 2,66,714 దరఖాస్తులొచ్చాయి. అంటే గతేడాది కంటే ఈసారి 54,052 మంది అభ్యర్థులు ఎక్కువగా దరఖాస్తు చేశారు. ఈ ఏడాది ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల స్థానంలో ఈ సారి సిట్టింగ్ అబ్జర్వర్లను ప్రతి కేంద్రంలో నియమిస్తారు. వారే పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని రకాల పనులనూ పర్యవేక్షిస్తారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచుతారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ప్రత్యేక బస్సులను టిఎస్‌ఆర్‌టిసి నడపనుంది. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్‌కు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు.

ఓఆర్‌ఆర్ లీజు విధివిధానాలను బయటపెట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని 158 కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్న నెహ్రూ ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్‌ఆర్)ను కేవలం రూ.7,380 కోట్లకు 30 ఏళ్లపాటు లీజుకిచ్చిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఈ లీజుకివ్వడం వెనుక అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే ఓఆర్‌ఆర్ లీజు విధివిధానాలను పారదర్శకంగా ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌కు మణిహారంగా, ప్రజలకు సౌకర్యంగా, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉన్న ఓఆర్‌ఆర్‌ను ముంబయికి చెందిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ లిమిటెడ్ అనే ప్రయివేటు కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం లీజుకివ్వాలని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ఆర్నెళ్ల క్రితమే లీజు నిర్ణయం జరిగినా గోప్యంగా ఉంచిందని పేర్కొన్నారు. ప్రతి ఏటా పెరుగుతున్న ఓఆర్‌ఆర్ ఆదాయం మేరకు లీజు నిర్ణయం జరగలేదని, నిబంధనలేవీ పాటించలేదని, వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆర్థిక నిపుణులు, సంస్థలు డిమాండ్ చేస్తున్నాయని వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అదానీ, అంబానీల వంటి ప్రయివేట్, కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను కాపాడుకుంటామని, ప్రయివేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తామని చెప్పే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఓఆర్‌ఆర్ తదితరాలను ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టకుండా చూడాలని డిమాండ్ చేశారు. లీజుకు సంబంధించిన విమర్శలు వస్తున్నందున ఒప్పంద వివరాలను ప్రజలముందుంచాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య శాఖలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపిక

- రెండు వారాల్లోగా నియామక ప్రక్రియ పూర్తి చేయండి
- మంత్రి హరీశ్ రావు ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్య శాఖలో 1,442 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డు (ఎంహెచ్‌ఎస్‌ఆర్‌బి) విడుదల చేసింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 34 స్పెషాలిటీ విభాగాలకు వీరు ఎంపికయ్యారు. కొత్తగా ప్రారంభమైన మెడికల్ కాలేజీల్లో మెరిట్ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు కోరుకున్న చోట నియామక ఉత్వర్వులను పొందనున్నారు. భర్తీ ప్రక్రియను కేవలం ఐదు నెలల రికార్డు సమయంలోనే విజయవంతంగా పూర్తి చేసిన బోర్డును ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఈ సందర్భంగా అభినందించారు. ఈ మేరకు సోమవారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించి, ఎప్పటికప్పుడు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తూ, ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటూ, అర్హులు ఉద్యోగ అవకాశాలు పొందేలా చేయడం గొప్ప విషయమని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ఎంపికైన వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సిఎం కెసిఆర్ నిర్ణయంతో రాష్ట్రంలో వైద్యవిద్య అవకాశాలు పెరిగి, సూపర్ స్పెషాలిటీ సేవలు మారుమూల ప్రాంతానికి సైతం చేరువ అయ్యాయని మంత్రి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ క్రమంలో అవసరమైన వైద్య సిబ్బంది భర్తీని ప్రభుత్వం ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. ఒకవైపు వైద్యుల భర్తీతో పాటు, మరోవైపు 5,204 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీని మొదలు పెట్టినట్టు వివరించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా స్టాఫ్ నర్సు నియామక ప్రక్రియ పూర్తి చేసేందుకు ఆన్ లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) ద్వారా పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెండు వారాల్లోగా కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తి చేసి, నియామక ఉత్వర్వులు అందించి, విధుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె రమేశ్ రెడ్డిని ఆదేశించారు.

రైతులకు అండగా ఉందాం

- ఉన్నతాధికారులు, రైస్ మిల్లర్లతో మంత్రి గంగుల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలతో రాష్ట్రంలో చేతికొచ్చిన పంట నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న రైతాంగానికి అందరూ సహకరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ధాన్యం సేకరణ వేగవంతంగా జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం చేసే కృషికి బాధ్యత గల మిల్లర్లుగా రైస్ మిల్లింగ్ పరిశ్రమ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం సచివాలయంలో రాష్ట్ర మిల్లర్ల సంఘం ప్రతినిధులు, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలతో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో ధాన్యం అన్‌లోడింగ్ సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఆ రెండు జిల్లాల్లో ఎటి పరిస్థితుల్లోనూ కొనుగోలు కేంద్రం నుంచి పంపిన ధాన్యాన్ని దింపుకోవాలని ఆదేశించారు. పదే పదే తడిచిన ధాన్యం మిల్లింగుకు పనికి రాకుండా పాడవుతుందని, నూక శాతం పెరగడంతో పాటు రంగుమారుతుందని, అలాంటి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఆమోదించకపోవడంతో నష్టం జరుగుతున్నదని తెలిపారు. కనీస నాణ్యతా ప్రమాణాలను సడలించాలంటూ ఎఫ్ సిఐకు లేఖ రాశామని, మరోసారి దీన్ని ఆమోదించాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. రూ.3,161 కోట్ల విలువైన 15.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6,087 కొనుగోలు కేంద్రాల ద్వారా ఒక లక్షా 7 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్టు మంత్రి వివరించారు. ఈ సమావేశంలో ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్ రెడ్డి, పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ చైర్మెన్ రవీందర్ సింగ్, కమిషనర్ వి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

మంత్రి గంగుల తన జన్మదినాన్ని పురస్కరించుకుని సచివాలయంలో సిఎం కెసిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం గంగులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పత్తి కోసం గోద్రెజ్ ఆగ్రోవెట్ కొత్త బ్రాండ్

నాగ్‌పూర్ : పర్యావరణ అనుకూల పత్తి ఉత్పత్తి కోసం అంబ్రెల్లా బ్రాండ్ 'పిన'ను ప్రారంభించినట్లు గోద్రెజ్ ఆగ్రోవెట్ వెల్లడించింది. విత్తనం విత్తడం నుండి చురుకుగా పుష్పించే దశ వరకు కలుపు నిర్వహణ పరంగా పిన బ్రాండ్ విస్తృత శ్రేణీ ఉత్పత్తులను కలిగి ఉందని పేర్కొంది. "పత్తి పంటలు తొలిదశలో నెమ్మదిగా పెరుగుతాయి. పంటల మధ్య విశాలమైన ఖాళీ కారణంగా, కలుపు మొక్కలు పత్తి దిగుబడిని 45-50% వరకు ప్రభావితం చేస్తాయి. పినా బ్రాండ్‌లు విత్తనం విత్తడం నుండి పంట దశలో చురుకుగా పుష్పించే దశ వరకు కలుపు నిర్వహణ ఎంపికల విస్తృత విండోను అందించడంతో, రైతులు ఇప్పుడు కలుపు రహిత పంటను ఎక్కువ కాలం పొందవచ్చు." అని జివిఎల్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సిఇఒ రాజవేలు ఎన్‌కె పేర్కొన్నారు.

సెంట్రల్ బ్యాంక్‌కు రూ.571 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సిబిఐ) 84 శాతం వృద్ధితో రూ.571 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంత క్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.310 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ4లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 45 శాతం పెరిగి రూ.3,513 కోట్ల నుంచి రూ.2,416 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయం 125 శాతం వృద్ధితో రూ.1424 కోట్లుగా నమోదయ్యింది. 2023 మార్చి నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 8.44 శాతానికి తగ్గాయి. 2022 డిసెంబర్ ముగింపు నాటికి జిఎన్‌పిఎ 8.85 శాతంగా ఉంది. నికర నిరర్థక ఆస్తులు 2.09 శాతం నుంచి 1.77 శాతానికి తగ్గాయి.

మైక్రోసాఫ్ట్‌తో మేక్ మై ట్రిప్ భాగస్వామ్యం

గూర్‌గావ్ : ట్రావెల్ బుకింగ్ విభాగానికి కొత్త రూపాన్ని ఇచ్చేందుకు మైక్రోసాఫ్ట్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని మేక్ మై ట్రిప్ వెల్లడించింది. దీంతో భారతీయ భాషలలో వాయిస్ అసిస్టెడ్ బుకింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొంది. ఈ కొత్త ఇన్ ప్లాట్‌ఫారమ్‌ను మైక్రోసాఫ్ట్ అజ్యూర్ ఓపెన్ ఎఐ సర్వీస్, అజ్యూర్ కాగ్నెటివ్ సర్వీసెస్ అభివద్ధి చేసిందని తెలిపింది. వాయిస్ అసిస్టెడ్ బుకింగ్ ఫ్లోను తదుపరి దశకు తీసుకెళ్లనుందని పేర్కొంది

విదేశాల్లో ఉద్యోగాల కోసం నమోదు చేసుకోండి

- టామ్ కామ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల్లో ఉద్యోగాల కోసం ఆసక్తి, అర్హత కలిగిన వారు తమ పేర్లను టామ్‌కామ్ వెబ్‌సైట్ లేదా యాప్‌లో నమోదు చేసుకోవాలని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఏజెన్సీ కోరింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. జర్మనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రాజెక్టు మేనేజర్, కన్సల్టెంట్స్, ఈఆర్పీ, ఐటీ-సపోర్ట్ జాబ్ రోల్స్ కోసం నియామక ప్రక్రియను సులభ తరం చేసినట్టు వెల్లడించింది. అభ్యర్థి గ్రాడ్యుయేట్ పూర్తి చేసి సంబంధిత రంగంలో మూడేండ్ల నుంచి ఐదేండ్ల అనుభవంతో పాటు జర్మన్ భాషలో బి1 లేదా బి2 స్థాయి ప్రావీణ్యం కలిగి ఉండాలని సూచించింది. మరిన్ని వివరాలకు 98496 39539ను సంప్రదించవచ్చని పేర్కొంది

మూలనపడ్డ మగ్గం

ఉపాధి కరువై .. వృత్తికి దూరం

- రోడ్డున పడ్డ వేలాది చేనేత కుటుంబాలు
- పట్టణాలకు వలసపోయి కూలీలుగా జీవనం
- కేంద్ర ప్రభుత్వ సహకారం లేక మూలనపడిన మగ్గాలు
- కార్మికులకు భారంగా మారిన జిఎస్‌టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వ చేయూత కరువైంది. సహకార సంఘాలకు బడ్జెట్ కేటాయించకపోవడం వలన సహకార సంఘాల నిర్వహణ భారంగా మారింది. దీనికి తోడు రంగులు, రసాయానికాలు నూలుపై భారీగా జిఎస్‌టి వేయడం వల్ల కొనుగోళ్లపై తీవ్రమైన భారం పడింది. దీనివల్ల చేనేత ఉత్పత్తులకు పేరుగాంచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేనేత కార్మికుల బతుకులు దయనీయంగా మారాయి.

దేశంలోనే పాలమూరు చేనేత బట్టలకు మంచి పేరు ఉంది. నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల, వనపర్తి జిల్లాలో చేనేత రంగంపై వేలాదిమంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వ ఆదరణ లేకపోవడం వల్ల వందలాది మగ్గాలు నిలిచిపోయాయి. ఇందులో పనిచేస్తున్న చేనేత కార్మికులు భవన నిర్మాణ కార్మికులుగా, నగరాల్లో అడ్డా కూలీలుగా జీవిస్తున్నారు. 1985లో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని కేంద్రప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ చట్టంతో 11 రకాల వస్త్ర ఉత్పత్తులను చేనేత పరిధిలోకి తెచ్చారు. అయితే, బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత రంగాన్ని దివాళా తీయించింది. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం అందకపోగా, జిఎస్‌టి పేరుతో భారాలు వేయడంతో తమ పరిస్థితి దయనీయంగా తయారైందని చేనేతపై ఆధారపడిన కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. జిఎస్‌టి పేరుతో చేనేత వస్త్రాలపై ఐదు శాతం, నూలు రంగులు రసాయనాలపై 18 శాతం జిఎస్‌టి అమలు చేస్తుంది. చేనేత వస్త్రాలను దెబ్బతీసేందుకే కేంద్రం కుట్ర పన్నిందని చేనేత సంఘాలు విమర్శించాయి.

మూతపడుతున్న మగ్గాలు

మహబూబ్‌నగర్ జిల్లాలో 27 సహకార సంఘాలున్నాయి. 24 సహకార సంఘాలున్నాయి. అమిస్తాపూర్‌లో రెండు దేవరకద్రలో ఒకటి మాత్రమే ప్రస్తుతం ఉత్పత్తి కొనసాగిస్తుంది. నారాయణపేటలో 29 సహకార సంఘాలకు ఐదు సంఘాలు మాత్రమే పనిచేస్తున్నాయి. జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, వనపర్తి, జిల్లాల పరిధిలో జిల్లాలో 17 సహకార సంఘాలు ఉండగా ప్రస్తుతం ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. వనపర్తి జిల్లాలో తొమ్మిది సహకార సంఘాలకు మూడు నడుస్తున్నాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో నాలుగు సహకార సంఘాలకు గాను ఒకటి మాత్రమే పనిచేస్తుంది. గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల పరిధిలో 3206 వ్యక్తిగత మగ్గాలకు గానూ 250 మాత్రమే పనిచేస్తున్నాయి. నారాయణపేట మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో మూడు వేల వ్యక్తిగత చేనేత మగ్గాలకు గానూ 150 మగ్గాలు మాత్రమే నడుస్తున్నట్టు తెలిసింది.

కల్వకుర్తి మండలం రఘుపతి పేటలో

రఘుపతి పేటలో చేనేత పవర్ లూమ్ మగ్గాలు 560 కు పైగానే ఉన్నాయి. మగ్గాలునేసే కార్మికులు 1500 మంది



ఉన్నారు. వీరి మీద 3000 మంది ఆధారపడి జీవిస్తున్నారు. 2000 సంవత్సరం వరకు ఇక్కడ మగ్గాలు బాగానే నడిచాయి. ప్రభుత్వ సహకారం లేకపోవడం వల్ల అన్ని మూలనబడ్డాయి. 2000 సంవత్సరం కంటే ముందు కేంద్రం రిబేటు ఇచ్చేది. ఆప్కో సహకారం లేకపోవడంతోనే చేనేత కార్మికులు రోడ్డున పడ్డారు. రాజోలి అలంపూర్ ఆమనగల్ రఘుపతిపేట మార్చాల మాడుగుల నారాయణపేట మక్తల్ చిన్నపూర్ల, పెద్దపూర్లా, కొత్తకోట, గద్వాల, ఐజ, మందకల్, ధరూర్, అమరచింత, ఆత్మకూరు తదితర ప్రాంతాలలో ఉన్న సొసైటీలు మూతపడ్డాయి.

కూలీలుగా జీవనం..

కల్వకుర్తి మండలం రఘుపతిలోనే చేనేత మగ్గాలు నిలిచిపోవడంతో 450 మంది కార్మికులు రోడ్డునపడ్డారు. హైదరాబాద్, నల్లగొండ, గుజరాత్, ముంబయి వంటి ప్రాంతాలకు వలస వెళ్లి మేస్త్రి పనులు చేస్తున్నారు. గుర్రం శ్రీనివాసులుకు ముగ్గురు కొడుకులున్నారు. 30 సంవత్సరాలు చేనేత మగ్గంలో కుటుంబం పోషణ జరిగేది. మగ్గాలు ఆగిపోవడంతో వారంతా హైదరాబాదులో మట్టి పని చేసుకుని బతుకుతున్నారు. గుర్రం బాలరాజుకు నలుగురు కొడుకులు ఉన్నారు. చేనేత పనులు లేకపోవడంతో హైదరాబాదులో మోటారు మెకానిక్‌గా పని చేస్తున్నారు. గంజి గోపాలకు నలుగురు కొడుకులు. ఇల్లు లేదు. వీరంతా హైదరాబాదులో అడ్డా కూలీలుగా బతుకుతున్నారు. బోడ తిరుపతయ్యకు నలుగురు పిల్లలు. అచ్చంపేటలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. బోడ రామచంద్రంకు ఏడు మంది సంతానం. బతుకుదెరువు కోసం నల్లగొండలో జీవనం సాగిస్తున్నారు. బోడవెంకటనారాయణ బోడ రామస్వామి ప్రభాకర్ గుర్రం పాండయ్య గుర్రం బాలస్వామి బచ్చయ్య మాకం మహాదేవ్ వీరంతా కటిక దరిద్రం లో జీవనం సాగిస్తున్నారు.

కేంద్రం చేయుత కరువు

చేనేత కార్మికులపై కేంద్ర ప్రభుత్వం చేయూత కరువైంది. 1985లో వచ్చిన చేనేత రిజర్వేషన్ చట్టం అమలుపై కేంద్రం నిర్లక్ష్యం చూపుతోంది. ఈ చట్టం ప్రకారం 11 రకాల వస్త్రోత్పత్తులను చేనేత ద్వారానే ఉత్పత్తి చేయాలని నిబంధన ఉంది. నిబంధన మేరకు 11 రకాల ఉత్పత్తులను చేనేత సహకార సంఘాలకు అప్పగించలేదు. అది చేయకపోగా చేనేత ఉత్పత్తులపై 20 శాతం జిఎస్‌టి అమలు చేసి తమను ఆగాదంలోకి నెట్టిందని వాపోతున్నారు.

చేనేత రంగాన్ని కాపాడండి

బోడ బుచ్చయ్య, అధ్యక్షులు, చేనేత సహకార సంఘం రఘుపతి పేట

మా సహకార సంఘం 100 సంవత్సరాలుగా నడుస్తోంది. బ్రిటిష్ కాలం నుండి ఇక్కడ చేనేత ఉత్పత్తులు జరిగాయి. చేనేత సంఘం మూతపడడంతో 500 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. వీరంతా ఇప్పుడు హైదరాబాద్, నల్లగొండ, ముంబయి వంటి నగరాలకు వలస పోయారు. ప్రభుత్వం నిధులు ఇస్తే సహకార సంఘంలో తిరిగి కార్మికులు వస్తారు.

నిధులు విడుదల చేయాలి

మాకమ్ మహాదేవ్ రఘుపతిపేట కార్మికుడు

నిధులు విడుదల చేస్తే మళ్లీ సహకార సంఘం పనిచేస్తుంది. సంఘం ఆడిట్ కూడా జరగలేదు. హైదరాబాద్‌కు వెళ్లి పనులు చేయాల్సి వస్తోంది.

సహకార సంఘాల ద్వారా కార్మికులకు ఉపాధి

గోవిందయ్య, జౌళిశాఖ ఎడి

చేనేత కార్మికులను రాష్ట్రప్రభుత్వం ఆదుకుంటోంది. సహకార సంఘాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి చేనేత మగ్గాలకు ఊతమిస్తుంది. ఇప్పటికే మూతబడిన చేనేత మగ్గాలను తిరిగి తెరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. ఈ మగ్గాలకు ఇప్పటికే నిధులు ఇచ్చి కార్మికులకు ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తున్నాం.

ఇచ్చిన హామీలడిగితే అరెస్టులా? : ఎస్‌సికెఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెల్లంపల్లి, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కెటిఆర్ పర్యటిస్తున్న సందర్భంగా సింగరేణి కాంట్రాక్టు కార్మిక, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. మధు ఖండించారు. సిపిఎం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వై. యాకయ్య, సిఐటియు పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వేల్పుల కుమారస్వామి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్, ఆర్జీ2 కార్యదర్శి ఉల్లి మొగలి, డివైఎఫ్ఐ యం.సురేష్, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని తప్పుబట్టారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో ఇచ్చిన సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులకు వేతనాల పెంపుదల, సొంతింటి కల హామీలపై మంత్రి కెటిఆర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి అపాయింట్‌మెంట్ అడిగితే అక్రమ అరెస్టులు చేయడమేంటని నిలదీశారు. కార్మికుల సంఘాలతో చేసుకున్న ఒప్పందాన్ని కూడా అమలు చేయలేని పరిస్థితి సింగరేణిలో ఏర్పడిందని విమర్శించారు. కాంట్రాక్టు కార్మికులంతా 18 రోజులు సమ్మె చేసినా ఒప్పందాన్ని అమలు చేయలేదని పేర్కొన్నారు. సింగరేణి పర్మినెంట్ ఉద్యోగస్తులు, కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు, పోలీసులు ఎన్ని అరెస్టులు చేసినా తిరగబడి పోరాడాలని కోరారు.

ప్రధాని ఆ వ్యాఖ్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే..

సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతోనే ప్రధాని మోడీ "జై భజరంగ బలి" అంటూ నినాదాలు ఇచ్చారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాంటి నినాదాలు ప్రధాన మంత్రి ఇవ్వటం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు అంశంలో రకరకాల పుకార్లనూ, ప్రచారాన్ని నమ్మొద్దనీ, ముందు స్థానిక సమస్యల పరిష్కారం కోసం దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకొస్తే.. ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామంటూ ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించడంపట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల కంటే ముస్లింలు వెనుకబడి ఉన్నట్టు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్లు నివేదికలిచ్చాయని గుర్తు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతిక కారణాలను చూపుతూ సిపిఐకి జాతీయ హోదాను ఉపసంహరించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. దామాషా పద్ధతిన ఎన్నికలు జరిగితే ఫలితాలు మరోరకంగా ఉంటాయని చెప్పారు. సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద వర్గాలకు అనేక కోతలు విధించిందని విమర్శించారు. నరేగా, ఆహార సబ్సిడీ, ఎరువుల నిధులకు కోత పెట్టిందన్నారు. హిందూ,ముస్లిం ,భారత్, పాకిస్తాన్ పేరుతో మత విద్వేషాలను రెచ్చగొట్టటం సిగ్గుచేటన్నారు.రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఫాసిస్టు అవశేషాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'ఇంటింటికీ సిపిఐ' పాదయాత్రలో పార్టీ దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను క్రోడీకరించి, వాటి పరిష్కారానికి భవిష్యత్‌లో పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధరణి పోర్టల్, రైతుల రుణమాఫీ, పోడు భూములు, ఇళ్ల స్థలాలు, గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు, విఒఎ, విద్యుత్ రంగంలోని ఆర్టిజన్, సింగరేణి ఇలా అనేక సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి పాల్గొన్నారు.



సమ్మె చేస్తున్న విఒఎలు

విఒఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

23వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్వాక్ర పొదుపు సంఘాలలో కీలకపాత్ర పోషిస్తున్న విఒఎలను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారికి నెలకు రూ.26 వేలు వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ ఐకెపి ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు సోమవారం 23వ రోజుకు చేరుకున్నాయి. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం నెహ్రూ సెంటర్‌లో సిఐటియు, సంఘం ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి పట్టణ పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల శోభ రాణి, మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. నెహ్రూ మండల కేంద్రంలో విఒఎల సంఘం మండల అధ్యక్షులు హనుమంతు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో సమ్మెకు మద్దతుగా సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ముందు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

చిట్యాల మండలకేంద్రంలో విఒఎల సమ్మెకు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేశ్ మద్దతు తెలిపారు. నాంపల్లి మండలంలో విఒఎలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కందుకూర్, మహేశ్వరం, కడ్తాల్, తలకొండపల్లి మండలకేంద్రాల్లో దీక్షలు కొనసాగుతున్నాయి. కందుకూర్ మండలకేంద్రంలో సిఐటియు మండల కన్వీనర్ బుట్టి బాలరాజు ఆధ్వర్యంలో విఒఎలు మూతికి నల్ల బట్ట కట్టుకొని నిరసన తెలిపారు.

విధుల్లో చేరకుంటే ఉద్యోగం ఊస్టే

- జెపిఎస్‌లకు రాష్ట్ర సర్కారు అల్టిమేటం
- నేటి సాయంత్రం ఐదు గంటల వరకు అవకాశం
- నోటీసులు జారీ చేసిన సందీప్‌కుమార్ సుల్తానియా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అగ్రిమెంట్ బాండ్‌ను ఉల్లంఘిస్తూ యూనియన్‌గా ఏర్పడి, తమ సర్వీసు డిమాండ్‌తో ఏప్రిల్ 28 నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జెపిఎస్‌లు) సమ్మెలోకి వెళ్లడం చట్టవిరుద్ధమని, విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తీసేస్తామని రాష్ట్ర సర్కారు హెచ్చరించింది. మంగళవారం సాయంత్రం ఐదు గంటల వరకల్లా విధుల్లో చేరాలని అల్టిమేటం జారీ చేసింది. సోమవారం ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా నోటీసులను జారీ చేశారు. 'జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేయడం నిబంధనలను ఉల్లంఘించడమే. జెపిఎస్‌లు యూనియన్ ఏర్పాటు చేయడం, సమ్మెకు దిగడం చట్టవిరుద్ధం. ప్రభుత్వంతో జెపిఎస్‌లు చేసుకున్న అగ్రిమెంట్ బాండ్‌ను ఉల్లంఘిస్తూ యూనియన్‌గా ఏర్పడి, తమ సర్వీసు డిమాండ్‌తో 2023 ఏప్రిల్ 28 నుండి సమ్మెకు దిగినట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. 'జూనియర్ పంచాయితీ సెక్రటరీగా విధుల్లో చేరే ముందు సంఘాలు, యూనియన్‌లలో చేరబోం అని ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. దాని ప్రకారం వారికి ఆందోళన చేసే, సమ్మెకు దిగే హక్కు లేదు. ఈ వాస్తవాలు తెలిసినప్పటికీ, జెపిఎస్‌లు ఒక యూనియన్‌గా ఏర్పడ్డారు. చట్టవిరుద్ధంగా ఏప్రిల్ 28, 2023 నుంచి సమ్మెలోకి వెళ్ళారు. నిబంధనలు అతిక్రమించిన నేపథ్యంలో ఉద్యోగాలలో కొనసాగే హక్కును ఇప్పటికే వారు కోల్పోయారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో జేపీఎస్‌లకు చివరి అవకాశాన్ని ఇస్తోంది. మే 9న సాయంత్రం ఐదు గంటల్లోపు విధుల్లో చేరాలి. విధుల్లో చేరని జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరూ టర్మినేట్ అవుతారు' అని నోటీసులో పేర్కొన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించనందుకే సమ్మెలోకి...

రాష్ట్ర ప్రభుత్వం 2019లో రిక్రూట్‌మెంట్ టెస్టు ద్వారా 9,355 పంచాయతీరాజ్ జూనియర్ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేసింది. మూడేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ ఒప్పందం మీద 2019 ఏప్రిల్ 12 నుంచి జేపీఎస్‌లు విధులు చేపట్టారు. ఆ తర్వాత నాలుగేండ్లకు పెంచింది. అన్ని శాఖల ఉద్యోగులకు రెండేండ్లు ఉంటే వీరికి నాలుగేండ్లకు పెంచడమేంటనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. అయినా, రాష్ట్ర సర్కారు వెనక్కి తగ్గలేదు. గొడ్డుచాకిరీ చేయలేక, మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు ఇవ్వటం, వేరే ఉద్యోగాలు రావటం వంటి కారణాలతో చాలామంది జేపీఎస్ కొలువును వదిలేసిపోయారు. వారి స్థానంలో ఎంట్రెన్స్ టెస్టు మెరిట్ లిస్టు ప్రకారం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో జేపీఎస్‌లను నియమించారు. వీరి బతుకులు మరీ దారుణంగా ఉన్నాయి. నాలుగేండ్ల పూర్తయినా పర్మినెంట్ చేయకపోవడంతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఏప్రిల్ 28వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లారు.

స్పష్టమైన హామీ ఇవ్వరు..సమ్మె చేయొద్దంటరు...

సమ్మెకు వెళ్లేందుకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును జూనియర్ పంచాయతీ కార్యదర్శులందరూ కలిశారు. ఆ సందర్భంగా మంత్రి వారికి స్పష్టమైన హామీ ఇవ్వలేదు. సీఎం కేసీఆర్ దగ్గర ఫైలు ఉంది కాబట్టి తొందరపడి సమ్మెలోకి వెళ్లొద్దంటూ ఆయన వారికి సూచించారు. ఇప్పటికే ఏ ప్రభుత్వ ఉద్యోగికి జరగని అన్యాయం తమకు జరుగుతున్నదనీ, ఇంకా నాన్చొద్దని జేపీఎస్‌లు మంత్రి దగ్గర గోసను వెళ్లబుచ్చుకున్నారు. తమను ఎప్పటిలోగా పర్మినెంట్ చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వాలని వారు అడిగారు. ఫైలు సీఎం దగ్గర ఉంది కాబట్టి తానేం చెప్పలేననీ, పర్మినెంట్ చేస్తారు కాబట్టి సమ్మెలోకి వెళ్లొద్దని ఎర్రబెల్లి అల్టిమేటం జారీ చేశారు. మంత్రి దగ్గర నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో అనివార్యంగా 28 నుంచి జేపీఎస్‌లు సమ్మెలోకి వెళ్లారు. మంత్రి చెప్పాడు కాబట్టి సమ్మెలోకి వెళ్లొద్దని కొందరు...లేదులేదు సమ్మెలోకి వెళ్లాల్సిందేనని జేపీఎస్‌ల యూనియన్ రెండుగా చీలిపోయింది. ఎక్కువ సంఖ్యలో జేపీఎస్‌లు సమ్మెలోకి వెళ్లారు. తాజాగా మూడు రోజుల కిందట కూడా మంత్రి దయాకర్‌రావు వారిని పిలిపించుకుని సమ్మె విరమించాలని సూచించారు. నిర్దిష్టమైన హామీ ఇచ్చే వరకు తమ సమ్మె కొనసాగుతుందని జేపీఎస్‌లు తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అల్టిమేటం జారీ చేసింది.

ప్రమాదవశాత్తు

చెరువులో పడి ముగ్గురు బాలికలు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బట్టలు ఉతకడానికి చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బాలికలు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటిపాములకి చెందిన గంధం కురుమన్న, భాగ్య దంపతులకు నలుగురు కూతుళ్లు.. ఒక బాబు.. ఉన్నారు. కాగా, సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కురుమన్న ముగ్గురు కూతుళు తిరుపతమ్మ (16), సంధ్య (12), దీపిక (10) గ్రామంలోని వీరసముద్రం చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ముగ్గురూ చెరువులో పడిపోయారు. సమీపంలో ఎవరూ లేకపోవడం, వారికి ఈత రాకపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. కొద్దిసేపటి తర్వాత అదే గ్రామానికి చెందిన ఒక మహిళ బట్టలు ఉతకడానికి వెళ్లగా ముగ్గురు బాలికలు చెరువులో కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం అందించింది. అందరూ వెళ్లి చూసేసరికి ముగ్గురు చనిపోయి ఉన్నారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. బాలికల తల్లిదండ్రులు గుండెలు బాదుకునేలా రోదించారు. సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు పంచనామ నిర్వహించారు.

తాటిపాముల సంఘటనపై మంత్రి దిగ్భ్రాంతి

ఈ సంఘటన పట్ల వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దిగ్భాంతి వ్యక్తం చేశారు. బాలికల మృతి తనను కలచి వేసిందని, చాలా దురదృష్టకరమైన సంఘటన అని అన్నారు. కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేసిన మంత్రి ప్రభుత్వం కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

అన్నమయ్య కీర్తనలలో సామాజిక సమ భావన



ప్రజాశక్తి-కల్చరల్

అందరిలో వున్నది పరమాత్మే నని, రాజైన బంటు ఐనా తిండి నిద్ర అవసరమేనని బోధించి, ఐదు వందల పూర్వమే ఏ కులజుడైననేమి గుణవంతుడైన అంటూ కులాతీత భావనలు వ్యాప్తి చేసిన సంస్కర్త అన్నమయ్య అని ప్రముఖ సాహితీ వేత్త వోలెటి పార్వతీశం అన్నారు. రవీంద్రబారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడెమీ, ఎబిసి ఫౌండషన్ నిర్వహణలో వాగ్గేయ కారుడు అన్నమాచార్య 615 జయంతి మహోత్సవ్ జరిగింది. బాలాజీ వర్మ, రాము రమాదేవి, సుష్మా ప్రీతి, కవిత, సమంత, జయశ్రీ తదితరులు శిష్య బృందం వంద కు పైగా అన్నమయ్య కీర్తనలను నృత్య ప్రక్రియలో నర్తించి ప్రేక్షకులను సమ్మోహితుల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వోలెటి పార్వతీశం పాల్గొని మాట్లాడుతూ ఆరేళ్ల పాప సైతం అన్నమయ్య కీర్తనకు నర్తించటం వేశేషమన్నారు. వీరే రేపు ఆ కీర్తనలు ప్రచారకులు అని పేర్కొన్నారు. వీరికి వేదిక కల్పించి ప్రోత్సాహిస్తున్న రమణా రావు, లలితరావులు అభినందనీయులు అన్నారు. భారత్ వరల్డ్ రికార్డ్ చైర్మన్ రమణారావు అధ్యక్షత వహించిన సభలోపోలీసు ఉన్నతాధికారి రామదాసు, నాట్య గురువు పద్మ కళ్యాణ్, సాహితీవేత్త వోలెటి పర్వతీశం,నటులు వైభవ్,పద్మిని నాగులపల్లి పాల్గొన్నారు. లలితరావు వ్యాఖ్యానంలో నాట్య గురువులు సంగీత గురువులకు చక్ర, నందకం అవార్డులు ప్రదానం చేశారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పలు జిల్లాల్లో వినూత్నంగా నిరసనలు తెలిపారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం తాడిచెర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షులు నరేశ్, ప్రధాన కార్యదర్శి మారుపాక కుమారస్వామి ఆధ్వర్యంలో కార్యదర్శులు బతుకమ్మ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. గణపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు గణపేశ్వరాలయంలో పూజలు చేసి నిరసన తెలిపారు. మహదేవపూర్ మండల కేంద్రంలో మండల పరిషత్తు కార్యాలయం ముందు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఎంపిపి సభ్యులు రాణి బాయ్ సమ్మెకు సంఘీభావం తెలిపారు. రేగొండ మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, సంఘం మండల అధ్యక్షులు మాచపాక శ్రీనివాస్ బతుకమ్మ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా ధరూర్‌లో చేపట్టిన సమ్మెకు సర్పంచ్‌లు మద్దతు తెలిపారు. ఆమనగల్‌లో నిర్వహించిన సమ్మెకు టిడిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్, ప్రముఖ న్యాయవాది అండేకార్ యాదిలాల్ మద్దతు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు వంటవార్పు చేసి నిరసన తెలిపారు.

పద్య విద్యను కాపాడుకొంటె తెలుగు భాష నిలుస్తుంది

ప్రజాశక్తి- కల్చరల్

తెలుగుకు మాత్రమే సంపద ఐన పద్యంను కాపాడుకొంటేనే భాష తన ఉనికిని నిలుపుకొంటుందని ప్రముఖ కవి పండితులు పేర్కొన్నారు. తెలుగు మాధ్యమాలు ప్రాధాన్యత భాష సజీవంగా ఉన్నంత కాలమేనని కాబట్టి పత్రికలు ఇతర మాధ్యమాలు భాషా పరిరక్షణను ఉద్యమంగా చేపట్టాలని వారు కోరారు. శివానంద ఆశ్రమంలో అవధాన విద్యావికాస్ పరిషత్ నిర్వహణలో వారం పాటు జరిగే అవధాన శిక్షణ శిబిరం సోమవారం ఆరంభమైంది. ముఖ్య అతిథిగా గురు సహస్రావదాని కడిమెళ్ల వరప్రసాద్ పాల్గొని లాంఛనంగా శిబిరాన్ని ఆరంభించి మాట్లాడారు. పద్య ప్రాధాన్యతతో కూడి ఉంది అవధానం అన్నారు. పద్యం అంటే పండితులకు చెందిందని అపోహ ఉందని అది సరికాదన్నారు. జాషువా కరుణశ్రీ వంటి వారు సులువైన పదాలతో పద్య రచన చేశారని వివ రించారు. అవధాన శిబిరం వారం పాటు ఆ ప్రక్రియపై అవగాహన కల్పిస్తోందని రాబోయే తరాలకు ప్రేరణ నిస్తుందని తెలిపారు. అధ్యక్షత వహించిన ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ మాట్లాడుతూ అవధానంకు ముఖ్యంగా ధైర్యం, ధోరణి, ధార, ధారణ అవసరమన్నారు స్పోకెన్ ఇంగ్లీష్, ఈ సెట్ ఎమ్ సెట్ , ఇతర దేశాలకు వెళ్లేటందుకు అవసరమయ్యే శిక్షణ కేంద్రాలలో అధిక సంఖ్యలో యువత ఫీజులు చెల్లించి హాజరు అవుతారని కానీ మాతృ భాష పరిరక్షణకు ఎక్కువ మంది ఆసక్తి చూపకపోవడం దురదృష్టమన్నారు. ఏడు రోజుల శిక్షణ శిబిరం అవధానం పై మార్గదర్శనం చేస్తోందని తెలిపారు. మంచి సంకల్పంతో సాధన చెస్తే ఉత్తమ అవధాని కావచ్చని ఆకాంక్షించారు. పరిషత్ వ్యవస్థాపకుడు మరు మామూల దత్తాత్రేయ శర్మ స్వాగతం పలుకుతూ శిక్షణా శిబిరం గత సంవత్సరం నుంచి ప్రారంభించినట్లు తెలిపారు ఈ సారి 20 మంది శిక్షణ పొందు తున్నట్లు తెలిపారు. వేదిక పై డాక్టర్ రంగాచార్యా, మహాదేవ మణి, ఆముదాల మురళి, బులుసు అపర్ణ, డాక్టర్ కసిరెడ్డి వేంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారుల

సమ్మె చేస్తే నోటీసులా?

పంచాయతీకార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేయడం దారుణమని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. ఆ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరారు. సోమవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 'జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 28 నుంచి సమ్మెలో ఉన్నారు. వారి సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నది. వారితో చర్చించి సామరస్యంగా పరిష్కరించకుండా అణిచివేత ధోరణికి పాల్పడుతున్నది. యూనియన్ పెట్టుకున్నందుకు, సమ్మె చేస్తున్నందుకు విధుల్లోంకి తొలగిస్తున్నామని నోటీసులు జారీ చేయడం దుర్మార్గం' అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామిక కార్మికులు యూనియన్ పెట్టుకోవడం, సమ్మె చేయడం హక్కు అని స్పష్టం చేశారు. రెగ్యులర్ చేయాల్సి వస్తే కమిటీ వేసి ఉద్యోగుల పనితీరు ఆధారంగా చేస్తామని మెలిక పెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రొబేషన్ పీరియడ్ డిక్లేర్ చేసి సర్వీసు రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.